సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

ఆదివారం । 24 । మార్చి । 2024



నైపుణ్యాలను ఒడిసి పడితే అవకాశాలు సొంతం

విద్యార్థి దశలో నైపుణ్యాలను ఒడిసి పడితే ఈ ప్రపంచమే మీదవుతుందని డాక్టర్ వై. సురేష్ రెడ్డి అన్నారు.

-IIలో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ ఆది (సా॥)	సహర్ సోమ (ఉ॥)
కడప	: 6.30	5.01
పులివెందుల	: 6.33	4.56
ప్రొద్దుటూరు	: 6.32	5.05

గరిష్ఠం/కనిష్ఠం
39.6 /26.2

వాతావరణం

జిల్లాలో శుక్రవారం 26.2 -39.6 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 5.76 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. -వైవీయూ

న్యూస్‌రీల్

24, 25 తేదీల్లో విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు

కడప కార్పొరేషన్: ఆది, సోమ వారాలు సెలవు దినాలు అయినప్పటికీ విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు అవకాశం కల్పించినట్లు ఏపీ ఎస్పీడీసీఎల్ ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈ ఎస్. రమణ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారుల సౌకర్యార్థం ఈనెల 24, 25 తేదీల్లో విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు యథావిధిగా పనిచేస్తాయన్నారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని బిల్లులు సకాలంలో చెల్లించి సంస్థ పురోభివృద్ధికి సహకరించాలని కోరారు.

బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న మల్లేశ్వరి

పులివెందుల రూరల్: పులివెందుల సర్వజన ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్‌గా డా.మల్లేశ్వరి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె గతంలో చిన్నపిల్లల వైద్య నిపుణులుగా తిరుపతి రుయా ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తుండగా అడిషనల్ డీఎంఈగా పదోన్నతి పై పులివెందుల సర్వజన ఆసుపత్రికి మెడికల్ సూపరింటెండెంట్‌గా పదోన్నతి పొంది బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా డా.మల్లేశ్వరికి వైద్య బృందం పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

దరఖాస్తుల ఆహ్వానం

వైవీయూ: ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలల్లో 2024-25 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గురుకుల విద్యాలయాల జిల్లా కన్వీనర్ సోమ సత్యశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 31వ తేదీ లోపు ఏపీఆర్ఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 5వ తరగతి, 6,7,8 తరగతుల్లో మిగిలిన సీట్లు, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం, డిగ్రీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాల కోసం ఏప్రిల్ 25వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 85559 02362, 97011 33148 నెంబర్లో సంప్రదించాలని కోరారు.

హోమియోపతి వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా సాంబమూర్తి

కడప రూరల్: కడప ప్రభుత్వ హోమియోపతి వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ సాంబమూర్తి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గుడివాడ మెడికల్ కాలేజీలో ప్రొఫెసర్‌గా బాధ్యతలు చేపడుతూ పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న ప్రొఫెసర్ డాక్టర్ రమాదేవి పదోన్నతిపై గుడివాడ హోమియోపతి మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా వెళ్లారు.

పది పరీక్షా కేంద్రాలు తనిఖీ

వైవీయూ: జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న పదోతరగతి పరీక్షల నేపథ్యంలో జిల్లా పరిశీలకులు ఎం. వెంకటకృష్ణారెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారి ఎం. అనూరాధా పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. జిల్లా వ్యాప్తంగా శుక్రవారం నిర్వహించిన ఫిజికల్ సైన్స్ పరీక్షకు 153 పరీక్షా కేంద్రాల్లో 29,149 మంది విద్యార్థులు హాజరుకాగా, 541 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా 13 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 69 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేయగా, డీఈఓ 5 పరీక్షా కేంద్రాలను, పరిశీలకులు 3 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. జిల్లా వ్యాప్తంగా ఎక్కడా అవాంఛనీయ ఘటనలు లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు సాగుతున్నట్లు డీఈఓ తెలిపారు.

నేడు షార్ట్‌హ్యాండర్ల సమావేశం, ఎన్నికలు

కడప కల్చరల్: ఆంధ్రప్రదేశ్ టైప్‌రైటింగ్, షార్ట్ హ్యాండ్ ఇనిస్టిట్యూట్స్ అసోసియేషన్ 7వ వార్షికోత్సవం, ఎన్నికలను ఆదివారం స్థానిక హరిత హోటల్‌లో నిర్వహించనున్నట్లు అసోసియేషన్ ప్రెసిడెంట్ శివకుమార్, కార్యదర్శి నవీన్‌కుమార్‌లు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 10 గంటలకు కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ జిల్లాల టైప్‌రైటింగ్ ఇనిస్టిట్యూట్ ప్రిన్సిపాళ్లు, ఇతర సిబ్బంది కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమానికి సోషల్ వెల్ఫేర్ డీడీ సరస్వతి, గ్రౌండ్ వాటర్ ఆడిట్ విభాగం డీడీ కె.సన్నన్న, వైవీయూ ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డిలు అతిథులుగా పాల్గొంటారన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు 2024-25 సంవత్సరానికిగాను సంస్థ ఎన్నికలు నిర్వహిస్తామని, నూతన కమిటీ సాయంత్రం 5 గంటలకు ప్రమాణ స్వీకారం ఉంటుందని తెలిపారు.

ఎన్నికలకు పోలీసుశాఖ సన్నద్ధం

- ఇప్పటికే జిల్లా స్థాయి, అసెంబ్లీ స్థాయి పోలీసు అధికారులకు శిక్షణ
- నియోజకవర్గాల వారీగా 'సమస్యాత్మక గ్రామాల'పై ప్రత్యేక నిఘా
- 'ఫ్లాగ్ మార్చ్'.. 'కార్డన్ అండ్ సెర్చ్'లలో కేంద్ర సాయుధ బలగాలు, స్థానిక పోలీసుల కవాతు
- ఆత్మస్థైర్యం పెంచేలా ఏఆర్, సివిల్ పోలీసులకు 'యాంటీ -రయట్' శిక్షణ
- వర్క్‌షాపుల ద్వారా పోలీసు అధికారులకు, సిబ్బందికి ఎస్పీ 'దిశా నిర్దేశం'



కడపలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో రోబో డ్రెస్‌లో శిక్షణ పొందుతున్న పోలీసులు

కడప అర్బన్: సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు పోలీసు యంత్రాంగం సంసిద్ధమైంది. జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ నేతృత్వంలో జిల్లాలోని ఒక పార్లమెంట్, 7 అసెంబ్లీ నియోజక వర్గాలలో నియోజకవర్గాల వారీగా పోలీసు అధికారులకు, సిబ్బందికి జిల్లా స్థాయి సమావేశాలు నిర్వహిస్తూ ఎన్నికల విధులకు సమాయత్తం చేస్తున్నారు. ప్రశాంత వాతావరణంలో ప్రజలు తమ ఓటు హక్కు వినియోగించుకునేలా పక్కా ప్రణాళికలతో పోలీసు ఉన్నతాధికారులు అడుగులు వేస్తున్నారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్‌ల సివిల్, జిల్లా కేంద్రంలో విధులను నిర్వహిస్తున్న ఏఆర్ పోలీసులకు ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వర్తించే దిశగా మూడు వారాలపాటు, విడతల వారీగా కడపలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్ వేదికగా ప్రత్యేకంగా 'పునశ్చరణ తరగతులు' నిర్వహించి ప్రతి పోలీసును శారీరకంగా, మానసికంగా ఎన్నికలకు 'సన్నద్ధం' చేశారు. ఈ శిక్షణను 'యాంటీ- రయట్' పేరుతో నిర్వహిస్తున్నారు.

నియోజకవర్గాల వారీగా 'సమస్యాత్మక గ్రామాల'పై ప్రత్యేక నిఘా ...

జిల్లాలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాలలో ఆయా నియోజకవర్గాలు, పోలీస్ స్టేషన్‌ల పరిధిలో గత ఎన్నికలలో అల్లర్లకు, గొడవలకు పాల్పడిన ప్రాంతాలపై పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు 'పల్లె నిద్ర', 'స్పందన' ద్వారా వచ్చే ఫిర్యాదుల పరిశీలన, గ్రామ సభల నిర్వహణ, బలహీన వర్గాల ప్రజలు నివాసం వుండే ప్రాంతాలలో పర్యటన, పీస్ కమిటీ సమావేశాలు, గ్రామ సర్వే కార్యక్రమాల ద్వారా పూర్తిగా పోలీసులు అవగాహనకు వచ్చారు.

- జమ్మలమడుగు నియోజకవర్గ ప్రాంతంలో పెద్దముడియం పోలీస్‌స్టేషన్ పరిధిలో జంగాలపల్లె, గుండ్లకుంట, ముద్దనూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆర్.జి పల్లె, కొండాపురం పీఎస్ పరిధిలో చౌటిపల్లి, పి. అనంతపురం, ఎస్. తిమ్మాపురం, లావనూరులలో స్థానిక పోలీస్ అధికారులు, కేంద్రసాయుధ బలగాలతో కార్డన్ అండ్ సెర్చ్‌తో పాటు, కవాతులను నిర్వహించారు.
- కలమల్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో కలమల్ల, చిన్నదుద్యాల, ఇల్లూరు, మాలేపాడులలో కేంద్ర సాయుధ బలగాలతో స్థానిక పోలీసు అధికారులు ఫ్లాగ్ మార్చ్‌ను నిర్వహించారు.
- కమలాపురం నియోజకవర్గంలో చెన్నూరు పోలీస్ స్టేషన్ పరిధిలో సమస్యాత్మక గ్రామాలైన ఉప్పరపల్లి, కొక్కిరాయపల్లిలో, వీఎన్ పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో సమస్యాత్మక గ్రామమైన ఉరుటూరులో పోలీసులు, సాయుధ పోలీసులతో 'ఫ్లాగ్ మార్చ్' నిర్వహించారు.
- కమలాపురం నియోజకవర్గంలోనే చింతకొమ్మదిన్నె పోలీస్‌స్టేషన్ పరిధిలో నాగిరెడ్డిపల్లి, బుగ్గలపల్లి, గుడావాండ్లపల్లి, నరసన్నగారిపల్లెలో పోలీసు, కేంద్ర సాయుధబలగాలతో ఫ్లాగ్ మార్చ్‌ను నిర్వహించారు.
- ప్రొద్దుటూరు, బద్వేల్, కడప, పులివెందుల, మైదుకూరు నియోజకవర్గాలలో వివిధ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో ఇప్పటికే పోలీస్ అధికారులు 'పల్లె నిద్ర', గ్రామ సభలను నిర్వహించారు. రానున్న రోజుల్లో 'సశస్త్ర సీమాబాల్' (ఎస్.ఎస్.బి)లతో సమస్యాత్మక గ్రామాల్లో 'ఫ్లాగ్ మార్చ్', కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించనున్నారు.
- వైఎస్ఆర్ జిల్లాలో ఒక పార్లమెంట్, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో అన్ని ప్రధాన పట్టణాలలో 'వర్క్‌షాపు'లను రెండు విడతలుగా నిర్వహించి పూర్తి స్థాయిలో సార్వత్రిక ఎన్నికల నిర్వహణ గురించి జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ నేతృత్వంలో పోలీసు అధికారులకు, సిబ్బందికి 'దిశా నిర్దేశం' చేశారు.
- జిల్లాలో మొత్తం 1963 పోలింగ్ స్టేషన్‌లు, 1302 లొకేషన్స్ వున్నాయి. వీటిలో సమస్యాత్మక పోలింగ్ స్టేషన్‌లు 511కాగా, అతి సమస్యాత్మక పోలింగ్ స్టేషన్‌లు 10 వున్నాయి.
- జిల్లాలో మూడేళ్లుగా సీజ్ చేసిన నగదు, మద్యం, డ్రగ్స్ విలువ సుమారు రూ. 29.98 కోట్లు ఉంటుంది.
- ఈ ఏడాది జనవరి నుంచి సీజ్ చేసిన నగదు, మద్యం, ఇతరత్రా సీజ్ చేసిన వాటి విలువ సుమారు రూ. 20.95 కోట్లు ఉంటుంది.
- జిల్లాలో పోలీసు, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా నిర్వహించిన బైండోవర్ కేసులు 2875కాగా, వీటి ద్వారా 14852 మందిని బైండోవర్ చేశారు.
- జిల్లాలో ఇప్పటివరకు 772 ఆయుధాలకుగాను, 571 ఆయుధాలను డిపాజిట్ చేశారు.




ఎన్నికల నిర్వహణ వర్క్‌షాపులో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ (ఫైల్)

స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

ఎన్నికలలో ప్రజలు స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకునేలా ప్రశాంత వాతావరణం కల్పించేందుకు కృషి జరుగుతోంది. వర్క్‌షాపుల నిర్వహణ, యాంటీ-రయట్ , ఫ్లాగ్ మార్చ్, కార్డన్ అండ్ సెర్చ్‌ల ద్వారా ప్రజలతో మమేకమై భరోసా కల్పిస్తున్నాం. రెవిన్యూ, అధికారుల సమన్వయంతో జిల్లాలో శాంతి యుతంగా ఎన్నికలు నిర్వహిస్తాం.

– సిద్దార్థ్ కౌశల్, జిల్లా ఎస్పీ



కేంద్ర సాయుధబలగాలతో ఫ్లాగ్ మార్చ్ (ఫైల్)

వేసవిలో నీటి అవసరాలపై ప్రత్యేక దృష్టి

కలెక్టర్ విజయ్ రామరాజు

కడప సెవెన్‌రోడ్స్: వేసవిలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నీటి అవసరాలపై ప్రత్యేక దృష్టి సారించామని, తాగునీటి కొరత లేకుండా ముందస్తు ప్రణాళికలు చేపట్టామని కలెక్టర్ వి.విజయ్ రామరాజు తెలిపారు. శనివారం విజయవాడ సీఎస్ క్యాంపు కార్యాలయం నుండి ఎన్ఆర్ఈజీఎస్ - కరువు మండలాల్లో వేజ్ జనరేషన్, వేసవిలో తాగునీటి అవసరాల సన్నద్ధత మొదలైన అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్‌లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సమావేశానికి కడప కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుంచి జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజుతో పాటు, జేసీ గణేష్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవిలో ఉపాధి పనుల లేబర్ కాంపోనెంట్ పెంపుతో పాటు, కూలీలకు తాగునీటి సదుపాయం కల్పిస్తామని తెలిపారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా అధిక నీటి ఎద్దడి పరిస్థితులు లేకపోయినప్పటికీ ఏప్రిల్ మాసం నాటికి అన్ని గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి అవసరాలకు సరిపడా ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నామన్నారు. ప్రత్యేకించి కడప పట్టణ నీటి అవసరాలను తీర్చే పెన్నానదిలో సరిపడా నీరు లేకపోవడంతో మైలవరం కుడి కాలువ నుండి ఆదినిమ్మాయపల్లె ఆనకట్ట ద్వారా నీరు అందించేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు.



వీసీలో పాల్గొన్న కలెక్టర్, జేసీలు

శాంతి భద్రతల దృష్ట్యా సెక్షన్ 144 అమలు

కడప సెవెన్‌రోడ్స్: కేంద్ర ఎన్నికల సంఘం నియమ నిబంధనల మేరకు ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగడానికి అందరూ సహకరించాలని కలెక్టర్ విజయ్‌రామరాజు ప్రజలకు, రాజకీయ పార్టీల ప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రక్రియకు ఎలాంటి అంతరాయం కలగకుండా, అవాంఛనీయ సంఘటనలు నివారించేందుకు జిల్లాలో సెక్షన్-144 అమలులోకి తీసుకొచ్చామన్నారు. ప్రశాంతతకు భంగం కలిగించే అవాంఛనీయ సంఘటనలను నివారించేందుకు ఈ సహేతుకమైన ఆంక్షలను అమలు చేయడం తప్పనిసరి అయిందన్నారు. తమ ఉత్తర్వులను ఉల్లంఘించే వారిపై ఐపీసీ సెక్షన్ 188 నిబంధనల ప్రకారం శిక్షార్హులవుతారని పేర్కొన్నారు. 144 సెక్షన్ ఉత్తర్వులను జిల్లా, డివిజనల్, మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాలు, పోలీసుస్టేషన్లలో నోటీసు బోర్డులపై ప్రదర్శిస్తామన్నారు. ఈ ఉత్తర్వుల విస్తృత ప్రచారం కోసం జిల్లా వెబ్‌సైట్‌లో కూడా పొందుపరుస్తామన్నారు. ఈ ఉత్తర్వులు ఈనెల 16 నుంచి అమలులోకి వచ్చాయని, జూన్ 6వ తేది వరకు అమలులో ఉంటాయన్నారు. రాత్రి 10 గంటల నుంచి మరుసటిరోజు ఉదయం 6.00 గంటల వరకు ఎన్నికల ప్రచారాలు జరగరాదన్నారు.

- ఆహో నుంచి.. హో..హో వరకు

కళతప్పిన హార్సిలీహిల్స్

- చల్లటిగాలులు కరువై..పెరిగిన వేడిసెగలు
- తగ్గిన పర్యాటకుల రాక



ఘాట్‌రోడ్డుకు ఇరువైపులా ఎండిపోయిన వృక్షాలు

బి.కొత్తకోట: అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండలంలోని వేసవివిడిది కేంద్రం హార్సిలీహిల్స్ పచ్చదనం కోల్పోతోంది. ఈ కొండ సముద్రమట్టానికి 1265.53 మీటర్ల (4141 అడుగులు) ఎత్తులో ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో దక్షిణాన ఉన్న ఎత్తయిన పీఠభూమి ఇది. బి.కొత్తకోట, కురబలకోట, మదనపల్లె, నిమ్మనపల్లె మండలాల్లో వాగులు, ఏరు ఏర్పడడానికి హార్సిలీకొండ కారణం. పచ్చనిచెట్లు, ఎత్తయిన వృక్షాలకు, చల్లటి వాతారణానికి ఆలవాలమైన కొండ ఇప్పుడు పచ్చదనం కోల్పోయింది. దీనికి వర్షాభావ పరిస్థితులే కారణం. ప్రతివేసవిలో పర్యాటకులు ఇక్కడ సేదతీరేందుకు వేలసంఖ్యలో తరలివస్తారు. కొండకు నాలుగువైపులా అడవే. ఎటుచూసినా మహావృక్షాలు కనిపిస్తాయి. హార్సిలీహిల్స్‌పై వాతారణం ఓ ఎత్తయితే..ఆశ్చర్యం గొలిపే వృక్షాలు మరోఎత్తు. 1882లో 16వ సెక్షన్‌కింద కొండలోని అటవీప్రాంతాన్ని, సంపదను రిజర్వ్ ఫారెస్టుగా ప్రకటించారు. మొత్తం 8,755 హెక్టార్లలో అడవులు విస్తరించి ఉన్నాయి. ఇందులో రిజర్వుఫారెస్టు 6,231 హెక్టార్లు, 'ఏ' రిజర్వ్‌ఫారెస్టు 1,348 హెక్టార్లు, 'బీ' రిజర్వ్‌ఫారెస్టు 1,176 హెక్టార్లు ఉంది. ఇంతటి అటవీ ప్రాంతం ఉన్న కొండపై ప్రస్తుతం పచ్చదనం కనిపించడం లేదు.

భారీగా తగ్గిన పర్యాటకులు

రాష్ట్రంలో అరకు తర్వాత అతిశీతల ప్రదేశం హార్సిలీహిల్స్. ఇక్కడ ఉక్కపోసిన సందర్భం చాలా అరుదు. పర్యాటకులు, స్థానికులు ఏసీలు, ఫ్యాన్లతో అవసరంలేకుండా నిద్రిస్తారు. అలాంటిది ప్రస్తుతం ఉక్కపోత భరించలేకపోతున్నారు. రాత్రివేళ్లలో చల్లటిగాలులు కరువయ్యాయి. మేఘాలు వర్షిస్తేకానీ చల్లదనం లేని పరిస్థితులు నెలకొన్నాయి. మార్చి మాసంలోనే ఇలాంటి ఆందోళనరక పరిస్థితులు నెలకొనడంపై ప్రకృతి ప్రియులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమిళనాడు, కర్ణాటక నుంచి పర్యాటకులు వస్తారు, ఇప్పుడు వీరిరాక ఆగిపోయింది.

తగ్గిన వర్షపాతం..పెరిగిన ఉష్ణోగ్రత

కొండపై ఏడాదికి సరాసరి వర్షపాతం 900 మి.మీ కురవాలి. అయితే ఈస్థాయిలో వర్షం కురిసి చాలా ఏళ్లవుతోంది. అసాధారణ పరిస్థితుల్లోనూ హార్సిలీహిల్స్‌లో ఉష్ణోగ్రత 30 డిగ్రీల సెల్సియస్‌కు మించదు. ఇప్పుడు 35నుంచి 40డిగ్రీల మధ్య ఉంటోంది. సాధారణంగా జనవరి మాసంలో 5 సెంటీగ్రేడ్‌కు చేరుకుంది. గడచిన రెండేళ్లుగా జనవరి మాసంలోనూ సాధారణంగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

మాధవరంలో విషాదం



సుబ్బారావు మృతదేహం



తల్లి, కుమార్తె మృతదేహాలు

- ఒకే కుటుంబంలో ముగ్గురు బలవన్మరణం
- కొత్తమాధవరం కన్నీటిమయం
- రెవెన్యూ అధికారులు మోసం చేశారని 'సూసైడ్‌నోట్'



సుబ్బారావు   పద్మావతి   వినయ (ఫైల్)

ఒంటిమిట్ట(రాజంపేట): అన్నమయ్య జిల్లా రాజంపేట నియోజకవర్గం ఒంటిమిట్ట మండలం కొత్తమాధవరంలో శనివారం విషాదం చోటుచేసుకుంది. చేనేత కార్మికుడిగా జీవనం సాగిస్తున్న పాలెం సుబ్బారావు (47) కుటుంబం ఆత్మహత్యకు పాల్పడింది. భార్య పద్మావతి (41), కుమార్తె వినయ (17) ఇంట్లో ఆత్మహత్యకు పాల్పడగా, పాలెంసుబ్బారావు (47) ఒంటిమిట్ట సమీపంలోని రైల్వే ట్రాక్‌పై రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సుబ్బారావు పెద్దకుమార్తె నిత్యలక్ష్మీ ప్రసన్న హైదరాబాద్‌లో చదువుకుంటోంది. నేతన్న కుటుంబం బలవన్మరణంతో కొత్తమాధవరం కన్నీటిమయమైంది.

తహసీల్దార్ వివరణ..

ఈ విషయంపై స్థానిక తహసీల్దారు వెంకటమరమణ విలేకర్లతో మాట్లాడుతూ తాను ఎన్నికల బదిలీలో భాగంగా ఇక్కడికి వచ్చానన్నారు. భూమి రికార్డులు తారుమారు చేశారనే ఆరోపణలపై విచారణ జరిపి సమగ్రనివేదికను ఉన్నతాధికారులు పంపుతానని స్పష్టం చేశారు.

సంఘటన స్థలానికి పోలీసులు..

సుబ్బారావు కుటుంబం బలవన్మరణానికి పాలడిన సంఘటన నేపథ్యంలో కడప డీఎస్పీ షరీఫ్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను పరిశీలించారు. సీఐ పురుషోత్తమరాజు, సిద్దవటం ఎస్ఐ పెద్దఓబయ్య కూడా ఆయన వెంట ఉన్నారు. అంతకుముందు సీఐ పురుషోత్తమరాజు తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని ఆత్మహత్యకు గల కారణాల గురించి అడిగి తెలుసుకున్నారు. డాగ్ స్క్వాడ్, క్లూస్‌టీం ఆధారాలను సేకరించారు. కాగా సుబ్బారావు భార్య,బిడ్డను హత్యచేసి, ఆ తర్వాత రైలుకింద పడ్డాడా, ఇంట్లోని వారిని ఎవరైనా హత్య చేశారా? వారే ఆత్మహత్య చేసుకున్నారా? సూసైడ్‌నోట్ మృతుడు రాసిందేనా.. ఇలా వివిధ అంశాలపై పోలీసులు విచారణకు దిగారు.

సూసైడ్ నోట్ ప్రకారం....



సూసైడ్‌నోట్ చూపిస్తున్న కడప డీఎస్పీ షరీఫ్

పాలెంసుబ్బారావుకు 2187/2 సర్వే నంబరులో 3.10 ఎకరాల భూమి ఉంది. ఖాతా నంబరు 1712 ప్రకారం పీఎం కిసాన్ డబ్బులు కూడా పడుతున్నాయి. గతంలో సుబ్బారావు తండ్రికి వైద్యం కోసం రూ.4లక్షలు, తమ్ముడి పెళ్లికి రూ.3లక్షల వరకు ఖర్చు అయింది. ఈ నేపథ్యంలో తనకున్న మూడు ఎకరాల పొలాన్ని అమ్మాలని ఇటీవల నిర్ణయించుకుని రికార్డులను పరిశీలించారు. తమ పేరుగల భూమి శ్రావణి పేరుతో రెవెన్యూ రికార్డులో ఉందని అధికారులు చెప్పడంతో మనస్తాపానికి గురయ్యారు. తమ భూమిని అధికారులు కుమ్మక్కై తారుమారు చేసినట్లు తెలియడంతో ఇక తమకు ఆ భూమి దక్కదన్న ఆందోళనతో ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు అందులో పేర్కొన్నారు. 'మా ఇంట్లోవారికి, అప్పులు ఇచ్చిన వారికి ఏమీ సంబంధం లేదంటూ ... మేము ఏమి చేయలేమని స్థితిలో చనిపోతున్నా'మని సూసైడ్‌నోట్‌లో రాసుకొచ్చారు.

కడప డీఎస్పీ ఏమంటున్నారంటే..

ఈ సంఘటనపై కడప డీఎస్పీ షరీఫ్ మాట్లాడుతూ అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని, అసలు కారణాలను బహిర్గతం చేస్తామని వివరించారు. సంఘటనా స్థలం వద్ద లభ్యమైన సూసైడ్‌నోట్‌ను కూడా పరిశీలించాల్సి ఉంటుందన్నారు. మృతుడు రాసిందా, మరెవ్వరైనా రాసారే అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

టీడీపీ పాలనలోనే ఈ అన్యాయం

ఒంటిమిట్ట: కొత్తమాధవరం ముగ్గురు మృతి ఘటనపై శవ రాజకీయాలు సరికాదని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ డైరెక్టర్ ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి అన్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో అన్యాయం జరిగిందంటూ రాజంపేట టీడీపీ పార్లమెంటరీ అధ్యక్షుడు చమర్తి జగన్మోహన్ రాజు వ్యాఖ్యలను ఆయన ఖండించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2015లో టీడీపీ హయాంలోనే సుబ్బారావు తండ్రి పాల వెంకటచలపతి పేరుతో 2187/2 సర్వే నెంబరు ఖాతా నెంబరు 1712ను ఆన్‌లైన్ చేసుకోవడం జరిగిందని, ఇది ఇలా ఉండగా అదే పరిపాలన సంవత్సరం అయినటువంటి 2017లో అదే సర్వే నెంబరులో గల ఖాతా నెంబర్‌ను కట్టా శ్రావణి పేరుతో ఆన్‌లైన్ మార్చారన్నారు. టీడీపీ నాయకులు వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు.

క్లుప్తంగా

మోటార్ బైకుల రికవరీలో పోలీసుల ప్రతిభ

ముద్దనూరు : పలు ప్రాంతాల్లో చోరీకి గురైన ద్విచక్రవాహనాలను రికవరీ చేయడంలో స్థానిక పోలీసులు ప్రతిభ కనబరిచారు. గత కొంత కాలం నుంచి ముద్దనూరుతోపాటు పరిసర మండలాల్లో మోటార్‌బైక్‌లు చోరీకి గురవుతున్నాయి. రెండు రోజుల క్రితం స్థానిక పోలీసు అధికారులు తమ విచారణలో చోరీకి గురైన సుమారు 10 మోటార్‌బైక్‌లను గుర్తించి వాటిని రికవరీ చేసి నిందితుడిని కూడా అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ చోరీలపై పూర్తిస్థాయిలో విచారణ జరుపుతున్నట్లు సమాచారం.

రూ.1.53 లక్షలు నగదు పట్టివేత

రాజుపాళెం : వాహన తనిఖీల్లో భాగంగా మండలంలోని గోపాయపల్లె చెక్‌పోస్టు వద్ద రూ.1.53 లక్షలు నగదును శనివారం సాయంత్రం పట్టుకున్నట్లు ఎస్‌ఐ పి.తులసీ నాగప్రసాద్ తెలిపారు. రమేష్ అనే వ్యక్తి ఆ డబ్బును బస్సులో ప్రొద్దుటూరుకు తీసుకెళుతుండగా ఎలాంటి బిల్లులు లేకపోవడంతో ఆ మొత్తాన్ని ఆదాయపు పన్ను శాఖ అధికారులకు ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులు అప్పగించారన్నారు. కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

రిమ్స్ మార్చురీలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం



కడప అర్బన్ : కడప నగర శివార్లలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్) మార్చురీలో గుర్తు తెలియని వ్యక్తి (50) మృతదేహం ఉన్నట్లు ఆర్ఎంఓ డాక్టర్ వై. శ్రీనివాసులు తెలిపారు. ఎవరైనా అతని బంధువులు ఉంటే తమను సంప్రదించాలని ఆర్ఎంఓ కోరారు.

నైపుణ్యాలను ఒడిసి పడితే అవకాశాలు సొంతం

- న్యూఢిల్లీ ఎస్ఆర్ఎఫ్ ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ వై. సురేష్‌రెడ్డి
- అద్వితీయ ప్రగతి సాధిస్తున్న వైవీయూ: ఎస్వీయూ వీసీ ఆచార్య శ్రీకాంత్‌రెడ్డి
- ఘనంగా వైవీయూ వ్యవస్థాపక దినోత్సవం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

వైవీయూ : విద్యార్థి దశలో సమాజ అవసరాలకు తగ్గట్టు నైపుణ్యాలను, లోతైన జ్ఞానాన్ని, నైపుణ్యాలను ఒడిసి పడితే ఈ ప్రపంచమే మీదవుతుందని న్యూఢిల్లీ ఎస్.ఆర్.ఎఫ్ ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ వై. సురేష్ రెడ్డి అన్నారు. శనివారం యోగివేమన విశ్వవిద్యాలయంలోని ఏపీజే అబ్దుల్‌కలాం కేంద్ర గ్రంథాలయ ఆవరణంలో విశ్వవిద్యాలయ 18వ వ్యవస్థాపక దినోత్సవం, కళాశాల ఉత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన ఎస్వీయూ వీసీ ఆచార్య శ్రీకాంత్‌రెడ్డి, ఎస్ఆర్ఎఫ్ ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ వై. సురేష్‌రెడ్డి, వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్‌లు విచ్చేసి జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ వై. సురేష్ రెడ్డి మాట్లాడుతూ నిన్నటి కంటే నేడు, నేటి కంటే రేపు మన ప్రగతి అభివృద్ధి దిశగా వెళుతుంటే మనకు ఉజ్వల భవిష్యత్తు సొంతమవుతుందన్నారు. విశ్వవిద్యాలయాల నుంచి కేవలం సర్టిఫికెట్ తీసుకొని సమాజంలోకి వెళితే ఎలాంటి ప్రయోజనం ఉండదని, వాటితో పాటు సబ్జెక్టులో లోతైన విషయ అవగాహన, నైపుణ్యాలను తీసుకువెళ్లినపుడు అవకాశాలు మీ ముంగిట వాలుతాయన్నారు. సమాజంలో ప్రభుత్వ, ప్రైవేటు, సెల్ఫ్ ఎంప్లాయిమెంట్, టీంవర్క్‌లలో ఎంపిక కావాలన్నా నైపుణ్యాలు అవసరమన్నారు. ఏ కుటుంబ నేపథ్యం నుంచి వచ్చామన్నది ముఖ్యం కాదని మనకు ఉన్న వనరులను ఎలా సద్వినియోగం చేసుకున్నామన్నది ముఖ్యమన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ మాట్లాడుతూ చంద్రయాన్ విజయాన్ని అందరం చూశాం, సంతోషించామని, ఇస్రో చైర్మన్ ఎస్వీ సోమనాథ్ అనారోగ్య సమస్యలను అధిగమించి ముందుకెళ్లడం ఉదాహరణలతో వివరించారు. యువత కష్టాలు ఉన్నాయని ఆగిపోతే ప్రగతి ఉండదన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలను నిలిపేలా హెడెక్స్ లాంటి వేదికలను రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల ముంగిటికి తీసుకువచ్చిందన్నారు. ఆ లక్ష్యాలను చేరుకునేందుకు విశ్వవిద్యాలయాలు కీలకపాత్ర పోషిస్తాయన్నారు. మరో ముఖ్యఅతిథి తిరుపతి శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య వి. శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ జాతీయ విద్యావిధానం-2020 మొట్టమొదట అమలులోకి తెచ్చిన రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌గా గుర్తు చేశారు. ప్రాజెక్టుల కోసం చేసిన దరఖాస్తుల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి వైవీయూ పరిశోధకుల అప్లికేషన్స్ ఎక్కువ సంఖ్యలో ఉన్నట్లు ఢిల్లీలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ వారు వెల్లడించడం సంతోషాన్ని కలిగించిందన్నారు . వైవీయూ ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి విశ్వవిద్యాలయ ప్రగతి నివేదికను సమర్పించారు. రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ విశ్వవిద్యాలయ వ్యవస్థాపకులు వైయస్ రాజశేఖర్ రెడ్డి ఆకాంక్షలకు ప్రతిరూపమైన విశ్వవిద్యాలయం ప్రగతిని సాధిస్తోందన్నారు. ప్రొద్దుటూరు డాక్టర్ వైఎస్సార్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సి. నాగరాజు కళాశాల అభివృద్ధి నివేదికను సమర్పించారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. పలు పోటీలలో విజేతలకు అతిథులు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డీన్‌లు ఆచార్య కె. కృష్ణారెడ్డి, ఆచార్య ఏజీ దాము, ఆచార్య టి.రామప్రసాద్‌రెడ్డి, ఆచార్య పుత్తా పద్మ, ఆచార్య పి. రమాదేవి, పాలకమండలి సభ్యులు డాక్టర్ ప్రమోద, సుబ్బారావు, ఆచార్య ఎం. మల్లికార్జునరెడ్డి, ఆచార్య చంద్రమతి శంకర్, డాక్టర్ మాదక్క, డాక్టర్ శ్రీలత, పి. ముబీనా బేగం, రాయలసీమ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ నాగుల అంకన్న, పూర్వపు ప్రధాన ఆచార్యులు జి. సాంబశివారెడ్డి, మాజీ రిజిస్ట్రార్ గులాం తారిఖ్, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

టీడీపీ నేత పల్లెకళాశాల బస్సు ఢీ

ఇద్దరి దుర్మరణం



ఏసోబు (ఫైల్)



బండెన్న (ఫైల్)



ప్రమాద స్థలంలో మృతదేహం, బైకు

బుక్కరాయసముద్రం/పెద్దముడియం : టీడీపీ నేత పల్లె రఘునాథరెడ్డి కళాశాలకు చెందిన బస్సు ఢీకొని ఇద్దరు కూలీలు దుర్మరణం చెందిన సంఘటన మండల పరిధిలోని రోటరీపురం గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. వైఎస్సార్ జిల్లా పెద్దముడియం మండలం బలపనగూడూరు గ్రామానికి చెందిన ఏసోబు (34), బండెన్న (41)లు నిరుపేదలు. బేల్దారీ పనులు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. కూలి నిమిత్తం రెండు రోజుల క్రితం బైకులో అనంతపురం వచ్చారు. పనులు పూర్తి కావడంతో శనివారం స్వగ్రామానికి బయలుదేరారు. రోటరీపురం గ్రామ సమీపంలో వెళ్తుండగా, పల్లె రఘునాథరెడ్డికి చెందిన కళాశాల బస్సు ఎదురుగా వేగంగా దూసుకొచ్చి వీరి బైకును ఢీకొంది. దీంతో తీవ్రగాయాలైన ఏసోబు, బండెన్న ఘటనాస్థలంలోనే ప్రాణాలు విడిచారు. రోటరీపురం సమీపంలో రహదారి పనులు జరుగుతున్నా లెక్కచేయక నిర్లక్ష్యంగా బస్సు నడపడంతోనే ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. బుక్కరాయసముద్రం సీఐ వెంకటేశ్వర్లు ఘటనా స్థలిని పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఏసోబుకు భార్య, ఇద్దరు కుమారులు, బండెన్నకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామాలపై నిఘా పెంచండి

రేంజ్ పరిధి ఎస్పీలకు డీఐజీ ఆదేశం



కర్నూలు/కడప అర్బన్ : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామాలపై నిఘా పెంచాలని డీఐజీ సీహెచ్ విజయరావు కర్నూలు రేంజ్ పోలీసు అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. అవసరమైతే కేంద్ర సాయుధ బలగాలతో కవాతు, పోలీసు పికెట్లు ఏర్పాటు చేయాలన్నారు. గ్రేవ్ క్రైంపై ప్రత్యేక దృష్టి సారించి నేర ప్రవృత్తి గల వారిని బైండోవర్ చేయాలన్నారు. కర్నూలు రేంజ్ డీఐజీ కార్యాలయం నుంచి శనివారం కర్నూలు, నంద్యాల, కడప, అన్నమయ్య జిల్లాల ఎస్పీలతో డీఐజీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పకడ్బందీ ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలకు లోబడి బాధ్యతగా పనిచేయాలన్నారు. ఏవైనా సంఘటనలు జరిగినప్పుడు వాస్తవాలను మీడియాకు వెల్లడించాలని, బందోబస్తు విధులకు కార్యాచరణ ప్రణాళిక ఏర్పాటు చేసుకోవాలన్నారు. పోలింగ్ రోజు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని, స్ట్రాంగ్ రూమ్‌ల దగ్గర సీసీ కెమెరాలతో పకడ్బందీ నిఘా ఉంచాలన్నారు.

ఉల్లంఘనలపై ఎఫ్ఐఆర్ నమోదు చేయండి

ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన వారిపై వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి పై అధికారులకు సమాచారం అందించాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసు బలగాలతో రూట్ మార్చ్, ఫ్లాగ్ మార్చ్ చేయించాలన్నారు. లైసెన్స్ ఆయుధాలన్నింటినీ డిపాజిట్ చేయించాలని, ఇంటిగ్రేటెడ్, బార్డర్ చెక్‌పోస్టుల్లో పోలీసులు, సెబ్, ఫారెస్ట్, ఆర్‌టీఏ అధికారులు సమన్వయంతో పనిచేసే విధంగా చూడాలన్నారు. ఎప్పటికప్పుడు చెక్‌పోస్టుల్లో తనిఖీలు చేయాలన్నారు. కర్నూలు, నంద్యాల, కడప, అన్నమయ్య జిల్లాల ఎస్పీలు కృష్ణకాంత్, రఘువీర్‌రెడ్డి, సిద్ధార్థ కౌశల్, కృష్ణారావుతో పాటు ఆయా జిల్లాల అడిషనల్ ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

శాశ్వత లోక్‌అదాలత్‌తో సత్వర న్యాయసేవలు

శాశ్వత లోక్‌అదాలత్ చైర్మన్ స్వర్ణప్రసాద్



మాట్లాడుతున్న శాశ్వత లోక్‌అదాలత్ చైర్మన్

వైవీయూ : శాశ్వత లోక్‌అదాలత్‌తో ఒక్కరూపాయి ఖర్చు లేకుండా సత్వర న్యాయపరిష్కారం పొందవచ్చని శాశ్వత లోక్ అదాలత్ జిల్లా చైర్మన్ స్వర్ణప్రసాద్ పేర్కొన్నారు. శనివారం కడప నగరంలోని స్పిరిట్స్ కళాశాలలో శాశ్వత లోక్ అదాలత్ ఆధ్వర్యంలో ప్రజా వినియోగిత సేవారంగాల్లో న్యాయసేవలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వర్ణప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ ప్రజా వినియోగిత సేవల చట్టాలపై అవగాహన ఉండాలన్నారు. పర్మినెంట్ లోక్ అదాలత్ ద్వారా ఫిర్యాదుదారులు ఎలాంటి కోర్టు ఖర్చులు లేకుండా సత్వర న్యాయపరిష్కారం అందిస్తామన్నారు. శాశ్వత లోక్‌అదాలత్ తీర్పు సుప్రీంకోర్టు తీర్పుతో సమానమన్నారు. అనంతరం 10 రకాలైన ప్రజా ప్రయోజిత సేవారంగాలకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించారు. పూర్తి వివరాలకు శాశ్వత లోక్ అదాలత్ కార్యాలయంలో లేదా 8639684279, 9963731698 నెంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో స్పిరిట్స్ కళాశాల డైరెక్టర్ ఎం.సి.రవీంద్ర, ప్రిన్సిపాల్ జ్యోతి, అధ్యాపకులు మునీర్, లోక్‌అదాలత్ మెంబర్ ఎం.వి. సుబ్బారెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తాతిరెడ్డిపల్లెలో అరటితోట దగ్ధం



లింగాల : లింగాల మండలం తాతిరెడ్డిపల్లెలో శుక్రవారం రాత్రి అరటి తోట దగ్ధమైంది. ఈ సంఘటనలో సుమారు రూ.15లక్షల వరకు నష్టం వాటిల్లింది. వివరాల్లోకి వెళ్తే తాతిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన యర్రావుల గంగాధర అనే రైతుకు చెందిన అరటితోటలో విద్యుత్‌లైన్ వెళుతోంది. విద్యుత్‌లైన్‌కు ఉన్న జంపర్లు మండి లైన్ తెగిపోవడంతో మంటలు అరటితోటలో పడ్డాయి. ఈ మంటలు తోటను పూర్తిగా కాల్చివేశాయని రైతు వాపోతున్నాడు. అటవీ ప్రాంతంలో ఉన్నందున సమయానికి ఎవరూ చూడకపోవడంతో గెలలకు వచ్చిన అరటి చెట్లు, డ్రిప్పు పరికరాలు పూర్తిగా కాలిపోయాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశాడు.

సెంట్రల్ బోలే వార్డులో తాగుబోతు వీరంగం



పగిలిపోయిన లైట్లను పరిశీలిస్తున్న కమిషనర్, సీఐలు

పులివెందుల టౌన్ : పులివెందుల పట్టణంలోని మెయిన్ బజార్‌లో సుందరీకరణలో భాగంగా సెంట్రల్ బోలే వార్డును రాష్ట్ర ప్రభుత్వం రూ.5కోట్లు ఖర్చు చేసి సుందరీకరణ చేసింది. ఇందులో భాగంగా శుక్రవారం రాత్రి ఒక ఆగంతకుడు సెంట్రల్ బోలే వార్డులో ప్రవేశించి విచక్షణా రహితంగా అక్కడ ఏర్పాటు చేసిన 9 బొలార్డ్ లైట్స్‌ను పగులగొట్టి పూలమొక్కలను పెరికివేశాడు. ఈ విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సీఐ , టీపీఓ, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు అక్కడికి చేరుకుని పరిశీలించారు.

ప్రొద్దుటూరులో ప్రభుత్వ ఉపాధ్యాయుడి ఆత్మహత్య

- లాడ్జిలోని గదిలో బ్లేడ్‌తో చేతి నరాలు కోసుకున్న రాజశేఖర్‌శర్మ
- కర్నూలు జిల్లాలోని గోనెగండ్ల మండలంలో పని చేస్తున్న ఉపాధ్యాయుడు
- తన తప్పు లేకున్నా అన్యాయంగా సస్పెండ్ చేశారని సూసైడ్ నోట్‌లో వెల్లడి



సంఘటనా స్థలంలో మృతి చెందిన నొస్సం రాజశేఖర్‌శర్మ

ప్రొద్దుటూరు క్రైం : కర్నూలు జిల్లాలో ప్రభుత్వ ఉపాధ్యాయుడుగా పని చేస్తున్న నొస్సం రాజశేఖర్‌శర్మ (49) ప్రొద్దుటూరులోని ఓ లాడ్జిలో ఆత్మహత్య చేసుకున్నాడు. తాను బస చేసిన లాడ్జి గదిలో బ్లేడ్‌తో చేతి నరాలు కోసుకోగా తీవ్ర రక్తస్రావమై కొంత సేపటి తర్వాత మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కర్నూలు జిల్లాలోని ఉయ్యాలవాడ మండలం, నొస్సం గ్రామానికి చెందిన రాజశేఖర్‌శర్మ కొన్నేళ్ల క్రితం ఉద్యోగ రీత్యా కర్నూలులో స్థిర పడ్డాడు. నగర శివారులోని స్కంద లోటస్ విల్లాస్‌లో వారి కుటుంబం నివాసం ఉంటోంది. ఆయన గోనెగండ్ల మండలంలోని పుట్టపాశం గ్రామంలో ఉన్న ఎంపీయూపీ స్కూల్‌లో మ్యాథ్స్ టీచర్‌గా పని చేస్తున్నాడు. ఆయనకు భార్య రమాదేవితో పాటు రిషికుమార్ అనే కుమారుడు ఉన్నాడు. కుమారుడు మూడో సంవత్సరం డిగ్రీ చదువుతున్నాడు. తాను పని చేస్తున్న పాఠశాలలో విద్యార్థులు చేసిన ఫిర్యాదుపై ఉన్నతాధికారులు రాజశేఖర్‌శర్మను ఇటీవల సస్పెండ్ చేశారు.

ఈ నెల 21న రాజశేఖర్‌శర్మ ఎప్పటిలాగే పాఠశాలకు వెళ్లాడు. కొంత సేపటి తర్వాత ఆయనను సస్పెండ్ చేసినట్లు ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు అందాయి. దీంతో ఉత్తర్వులు తీసుకోకుండానే పాఠశాల నుంచి వచ్చేశాడు. సాయంత్రం ఇంటికి వెళ్లిన రాజశేఖర్‌శర్మ మా సార్ పిలుస్తున్నాడు.. బస్టాండు వరకు వెళ్లొస్తానని చెప్పి బయటికి వెళ్లాడు. అయితే రాత్రి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు నగరమంతా ఆయన కోసం గాలించారు. 24 గంటలు గడిచినా ఇంటికి రాకపోవడంతో కర్నూలులోని 4వ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు శుక్రవారం మిస్సింగ్ కేసు నమోదు చేశారు.

ప్రొద్దుటూరు లాడ్జిలో ఆత్మహత్య

రాజశేఖర్‌శర్మ 21న కర్నూలు నుంచి నేరుగా ప్రొద్దుటూరుకు వచ్చాడు. ఆర్టీసీ బస్టాండు సమీపంలోని ఒక లాడ్జికి వెళ్లి రాత్రి అక్కడే పడుకున్నాడు. మూడు రోజులుగా అతను లాడ్జిలోనే ఉన్నాడు. ఈ క్రమంలో శనివారం అతను చేతులకు రక్తం కార్చుకుంటూ లాడ్జి గదిలో నుంచి బయటికి వచ్చాడు. రక్తంతో ఉన్న అతన్ని చూసి లాడ్జి నిర్వాహకులు వెంటనే ఫోన్ చేయడంతో 108 అంబులెన్స్ అక్కడికి వచ్చింది. అయితే అంబులెన్స్ సిబ్బంది వచ్చి చూసేలోపే రాజశేఖర్‌శర్మ చనిపోయి ఉన్నాడు. విషయం తెలుసుకున్న టూ టౌన్ సీఐ అబ్దుల్‌కరీం సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. రెండు చేతుల నరాలను కోసుకోవడం వల్ల తీవ్ర రక్తస్రావమై అతను చనిపోయినట్లు పోలీసులు గుర్తించారు. మృతుడు రాసుకున్న సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. భార్య రమాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

నన్ను అన్యాయంగా సస్పెండ్ చేశారు..



నా పై అధికారులు నాతో మాట్లాడలేదు.. ఏం జరిగిందో నన్ను అడగకుండానే ఉపాధ్యాయుల మాట విని నన్ను సస్పెండ్ చేశారు. నేను ఏ తప్పు చేయలేదు. విద్యార్థులతో చనువుగా ఉండటం తప్పా..! చివరకు చిన్న పిల్లల చేత ఉపాధ్యాయులు నాపై తప్పుడు ఫిర్యాదు ఇప్పించారు.. ఇది చాలా అన్యాయం సార్. నేను ఏ తప్పు చేయలేదు. అని రాజశేఖర్‌శర్మ సూసైడ్ నోట్‌లో రాసుకున్నారు.



సులభంగా ధ్రువపత్రాలు



గతంలో మా పిల్లల కోసం ఏవైనా ధ్రువపత్రాలు పొందాలంటే మీసేవలో దరఖాస్తు చేసుకుని, అనంతరం కార్యాలయాల చుట్టూ, మీ సేవ చుట్టూ తిరగాల్సి వచ్చేది. అయినా సకాలంలో చేతికందేవి కావు. అయితే జగనన్న సురక్ష కార్యక్రమంలో గ్రామ వలంటీర్లకు ధ్రువపత్రాలు కావాలని చెప్పగానే ఒక్కరోజులోనే ఇంటి వద్దకే ధ్రువపత్రాలు తెచ్చి ఇచ్చారు. ఇవి పిల్లలకు ఉపయోగపడ్డాయి. ఇన్ని సేవలందిస్తున్న ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం.

– కె. జయలక్ష్మీ, దుర్గానగర్, పీలేరు.

అన్నలా ఆదుకున్నాడు



మాది నిరుపేద కుటుంబం. మాకు ముగ్గురు ఆడ పిల్లలు సంతానం. నా భర్త బందల క్రిష్ణమూర్తికి వికలాంగ పెన్షన్, మా అత్త ఈశ్వరమ్మకు మంజూరయ్యే వృద్ధాప్య పెన్షన్ సొమ్ముతో జీవనం సాగించేవాళ్లం. నెల రోజుల క్రితం నా భర్త అనారోగ్యంతో మృతి చెందడంతో మేము మానసికంగా ఎంతో కుంగిపోయాము. ఈ తరుణంలో జగనన్న పుణ్యమా అని వైఎస్సార్ బీమా సొమ్ము రూ.లక్ష మంజూరు కావడంతో మాకు జీవితంపై భరోసా కలిగింది. వైఎస్సార్‌సీపీ పాలనలో నా కుమార్తెకు అమ్మ ఒడి, మా అత్తకు నెలవారి పెన్షన్, చేయూత, వైఎస్సార్ ఆసరా సొమ్ము, రైతు భరోసా, సున్నా వడ్డీ పథకాలతో మా కుటుంబం ఎంతో లబ్ధి పొందింది. ఇన్ని సంక్షేమ పథకాలు అందిస్తూ మా లాంటి నిరుపేద కుటుంబానికి ఓ అన్నలా ఆదుకున్న జగనన్నకు జీవితాంతం మేము రుణపడి ఉంటాం.

– బందల అంజలి, పెద్దతిప్పసముద్రం, తంబళ్లపల్లి నియోజకవర్గం, అన్నమయ్య జిల్లా.

పిల్లలతో సహా తల్లి అదృశ్యం



అదృశ్యమైన జ్యోతి, పిల్లలు (ఫైల్‌ఫొటో)

కాశినాయన : మండలంలోని వరికుంట్ల గ్రామానికి చెందిన సిద్దుజ్యోతి తన ముగ్గురు పిల్లలతో అదృశ్యమైంది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు గిద్దలూరు మండలం సూరేపల్లె గ్రామానికి చెందిన జ్యోతికి ఐదేళ్ల క్రితం వరికుంట్ల గ్రామానికి చెందిన సిద్దు వెంకటేశ్వర్‌రెడ్డితో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. భర్త మద్యానికి బానిసయ్యాడు. దీంతో తరచూ భార్యాభర్తలు గొడవ పడుతుండేవారు. ఈ నేపథ్యంలో విసుగుచెందిన భార్య జ్యోతి మూడు రోజుల క్రితం తన ముగ్గురు పిల్లలతో కలిసి ఇంటి నుండి వెళ్లిపోయింది. చుట్టుపక్కల గాలించినా కనిపించలేదని జ్యోతి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ అమరనాథ్‌రెడ్డి తెలిపారు.

చెట్టుకు ఉరివేసుకుని..

పెండ్లిమర్రి : మండలంలోని వెల్లటూరు గ్రామానికి చెందిన వెంకటక్రిష్ణ(60) అనే వ్యక్తి వెల్లటూరు గ్రామ పొలాల్లో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు.. వెంకటక్రిష్ణ ఈనెల 7వ తేదీన ఇంట్లో గొడవ పడి వెళ్లిపోయాడు. భార్య అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఈ నేపథ్యంలో శనివారం స్థానికులు గ్రామ పొలాల్లో చెట్టుకు ఉరివేసుకొని గుర్తుతెలియని మృతదేహం ఉందని పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించగా వెంకటక్రిష్ణగా గుర్తించారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సునీల్ కుమార్‌రెడ్డి తెలిపారు.

దళిత డిక్లరేషన్‌ను మేనిఫెస్టోలో పెట్టాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : అన్ని రాజకీయ పార్టీలు దళిత డిక్లరేషన్‌ను మేనిఫెస్టోలో పెట్టాలని డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు మునెయ్య కోరారు. శనివారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను కేటాయించి ఆయా వర్గాల సంక్షేమానికి అభివృద్ధికి, ఉపాధికి వినియోగించాలని కోరారు. భూమి కొనుగోలు పథకాన్ని పునరుద్ధరించి ప్రతి దళిత కుటుంబానికి రెండు ఎకరాల వ్యవసాయ భూమి కేటాయించాలన్నారు. ప్రైవేటు రంగంలో ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలని, దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని, చదువుకున్న దళిత నిరుద్యోగులకు స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ కేంద్రాల్లో శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించాలన్నారు. సమావేశంలో డీహెచ్‌పీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి నాగేశ్వరరావు, గిరిజన సంఘం జిల్లా నాయకులు శంకర్ నాయక్, బ్రహ్మం పాల్గొన్నారు.